సాక్షి
పల్నాడు
బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



చెన్నకేశవుడికి సూర్యకిరణ స్పర్శ

జంపని(వేమూరు) : జంపని గ్రామంలోగల చెన్న కేశవ స్వామి వారి మూల విరాట్టుని సూర్య కిరణాలు మంగళవారం స్పృశించినట్లు పూజారి శ్రీనివాస మూర్తి తెలిపారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.8,000, మోడల్ ధర రూ.5,700 వరకు పలికింది.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.


రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
నరసరావుపేట	6:29	4:34
గుంటూరు	6:27	4:37
బాపట్ల	6:27	4:37

పేదకు 'అగ్ర'స్థానం

అగ్రవర్ణ పేదలకు భరోసా

- నేడు ఈబీసీ నేస్తం రెండో విడత నగదు జమ
- పల్నాడులో 36,730 మంది మహిళలకు అర్హత
- ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 వేలు జమ చేయనున్న ప్రభుత్వం
- జిల్లాకు రూ. 55.05 కోట్లు కేటాయింపు



సాక్షి, నరసరావుపేట: గతంలో ఏ ప్రభుత్వమూ అగ్ర వర్ణ పేదల సంక్షేమ గురించి పట్టించుకున్న దాఖలా లేవు. సంక్షేమ ఫలాలు కొన్ని వర్గాలకే పరిమితం చేశారు. దీంతో అగ్ర వర్ణాలలో పుట్టినప్పటికీ పేదరికంతో బాధపడే వారిని ఏ ప్రభుత్వాలు ఆదుకోక, బయటకు చెప్పుకోలేక అనేక ఇబ్బందులు పడ్డారు. తన సుదీర్ఘ పాదయాత్రలో భాగంగా అన్ని వర్గాల కష్టాలను విని, చూసి ఇప్పటి వరకు లేని సంక్షేమ పథకాలను రూపొందించారు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలుఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల పేద మహిళలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం పేరిట ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అందులో భాగంగా 45–60 ఏళ్లలోపు మహిళలకు 'ఈబీసీ నేస్తం' పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేల చొప్పున వరుసగా మూడేళ్లపాటు ఇవ్వనున్నారు. ఒక్కొక్కరికీ మూడేళ్లకు కలిపి రూ.45 వేలు అందనుంది. ఇప్పటికే తొలి విడత నగదు జమ గతేడాది జనవరిలో జరగ్గా, రెండో విడత నేడు జమ కానుంది.

జిల్లాలో 36,730 మంది మహిళలకు అర్హత

ఈబీసీ నేస్తం ద్వారా పల్నాడు జిల్లాలో రెండో విడతకు 36,730 మంది అర్హత సాధించారు. మహిళల ఖాతాల్లో నేడు రూ.55,09,50,000 వారి బ్యాంకు ఖాతాల్లో జమకానున్నాయి. ఆర్థిక సహాయం పొందే లబ్ధిదారుల వివరాలు గ్రామ, వార్డు సచివాలయాల్లో జాబితాలను ప్రదర్శించారు.

పల్నాడు జిల్లాలో ఈబీసీ నేస్తం అమలు తీరు...

విడత	లబ్ధిదారులు సంఖ్య	నగదు జమ (రూ.కోట్లలో)
తొలి విడత	32,393	48.59
రెండో విడత	36,730	55.09

లబ్ధిదారులకు ఇవీ అర్హతలు

- వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం పథకాలు అమలైన మహిళలు అర్హులు కారు.
- కేవలం ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల మహిళలే అర్హులు.
- ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలి.
- బ్యాంకు ఖాతా కూడా వారి పేరు మీదనే ఉండాలి.
- కుటుంబ ఆదాయం గ్రామాల్లో నెలకు రూ.10, పట్టణాల్లో రూ.12 వేలకు మించరాదు.
- కుటుంబానికి మాగాణి 3 ఎకరాలు, మెట్టభూమి 10 ఎకరాలలోపు ఉండవచ్చు.
- కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగిగా ఉండకూడదు.
- పెన్షనర్ కూడా ఉండకూడదు. అయితే పారిశుద్ధ్య కార్మికులకు ఈ విషయంలో మినహాయింపు ఉంది.
- కుటుంబ సభ్యులెవరి పేరు మీద నాలుగు చక్రాల వాహనం ఉండకూడదు.
- ట్యాక్సీ, ఆటో, ట్రాక్టర్ ఉండవచ్చు.
- పట్టణాల్లో 750 చదరపు అడుగులకు మించి స్థలం ఉండరాదు.
- కుటుంబంలో ఆదాయ పన్ను కడుతున్న వారు ఉండకూడదు.
- ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్, పదో తరగతి, ఓటరు ఐడీ కార్డుల ద్వారా పుట్టిన తేదీని పరిగణలోకి తీసుకుంటారు.

అర్హుల ఎంపికలో వివక్షకు తావులేదు



వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకానికి అర్హుల ఎంపికలో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగింది. సంక్షేమ ఫలాలను అందించడంలో ఎటువంటి వివక్షలకు తావు ఇవ్వడం లేదు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల మహిళలకు ప్రభుత్వం ఏడాదికి రూ.15 వేలు చొప్పున మూడేళ్ల పాటు అందించనుంది. అన్ని వర్గాల పేదలను ప్రభుత్వం ఆదుకుంటోంది.

–శివశంకర్ లోతేటి, కలెక్టర్

మా కష్టాలను జగనన్న అర్థం చేసుకున్నారు



గతంలో ఏ ప్రభుత్వం కూడా అగ్రవర్ణ పేదల కష్టాల గురించి ఆలోచించలేదు. ప్రతి వర్గంలో పేద, ధనిక ఉంటారని గుర్తించి, వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్న గొప్ప మనిషి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. ఆయనకు అన్ని వర్గాల పేదలకు అండగా నిలుస్తారు. మా సంక్షేమ కోసం పోరాడుతున్న ముఖ్యమంత్రికి అండగా నిలుస్తాం.

– బొబ్బ అన్నపూర్ణమ్మ, ఆత్మకూరు, దుర్గి మండలం.

నివాళి



మహిళా సాధికారతకు బాటలు వేసిన గొప్ప మహనీయులు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని కొనియాడారు మంత్రి విడదల రజిని. మహాత్మా జ్యోతిరావ్ పూలే 197వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం చిలకలూరిపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పూలే చేసిన సేవలను కొనియాడారు.

–చిలకలూరిపేట



నరసరావుపేటలో జ్యోతిరావ్ పూలే 197వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని పూలే విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు.

–సాక్షి, నరసరావుపేట

న్యూస్‌రీల్

సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు అవకాశం

– జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: పట్టణ భూపరిమితుల చట్టానికి లోబడి ప్రభుత్వ పరిధిలో ఉన్న సీలింగ్, మిగులు భూములను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. దీనికి సంబంధించి జీఓ నెంబర్ 84 విడుదల చేశారని చెప్పారు. దీని ప్రకారం మే 1, 2019లోపు రిజిస్టర్ కాబడిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను పరిగణలోనికి తీసుకుంటామని చెప్పారు. 150 చదరపు గజాల వరకు అన్ని అర్హతలు ఉన్న వారికి ఉచితంగా డి–పట్టా ఇస్తామన్నారు. 150 నుంచి 300 చ.గ. వారికి బేసిక్ విలువలో 15 శాతం చెల్లిస్తే చాలన్నారు. 300 నుంచి 500 చ.గ. వాటికి బేసిక్ విలువలో 30 శాతం చెల్లించాలన్నారు. దరఖాస్తులు ఈ ఏడాది చివరి లోపు చేసుకోవాలన్నారు. దరఖాస్తు సమయంలో 50 శాతం, మిగిలిన 50 శాతం అనుమతి వచ్చిన నెల రోజులలోపు కట్టాలని తెలిపారు.

15 నుంచి సముద్రంలో వేట నిషేధం

రేపల్లె రూరల్: సముద్రంలో వేటను ఈనెల 15 నుంచి జూన్ 14 వరకు నిషేధిస్తున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పి.సాయిసందీప్ వెల్లడించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ తీరప్రాంత మత్స్యకారులు సముద్రంలో ఎవరూ చేపల వేట చేయవద్దని, వేటకు వెళ్లిన వారిపై ఏపీ ఎంఎఫ్ఆర్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్స్యకారులకు వేట నిషేధకాల భృతిని మంజూరు చేసేందుకు ఫిష్ లాండింగ్ సెంటరు వారీగా వేట నిషేధకాల జాబితాను తయారు చేసేందుకు ఈ నెల 17న ఆయా పడవలను తనిఖీ బృందం లాండింగ్ సెంటర్లకు వస్తాయన్నారు. ఆ సమయానికి మత్స్యకారులు తమ పడవలను తనిఖీ నిమిత్తం నిర్దేశించిన ఫిష్ లాండింగ్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలన్నారు. వేట నిషేధకాల భృతి పొందేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో లబ్ధిదారుడు కాని మత్స్యకారుడు మాత్రమే అర్హుడన్నారు. ఒక హౌస్ హోల్డ్‌ను ఒక కుటుంబంగా పరిగణిస్తామని, ఒక కుటుంబానికి ఒకరు మాత్రమే ఇందుకు అర్హులని చెప్పారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలనీ, రూ.1.20 లక్షల లోపు ఆదాయం కలిగిన గ్రామీణులు, రూ.1.44 లక్షలలోపు ఆదా యం కలిగిన పట్టణ ప్రజలు అర్హులని చెప్పారు. కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా, ఆదాయ పన్ను చెల్లిస్తున్నా వారు ఈ భృతికి అనర్హులని వెల్లడించారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

చిలకలూరిపేటటౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మండల న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో వచ్చేనెల 13 తేదీ జాతీయ లోక్అదాలత్ నిర్వహించనున్నట్లు మండల సేవాధికారసంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.రవీంద్రరెడ్డి చెప్పారు. ఈ లోక్అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్, సివిల్, భరణం , చెక్‌బౌన్స్ పరిష్కరించుకోవచ్చన్నారు. పట్టణంలోని రెండు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు డీఎస్సీ1998 నియామకాలు

–గుంటూరు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ–1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు మినిమం టైం స్కేల్ ప్రాతిపదికన ఉపాధ్యాయ నియామకాలు చేపట్టేందుకు బుధవారం గుంటూరులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 226 మంది అభ్యర్థులతో ఎంపిక జాబితా విడుదల చేశారు. జాబితాను http://doefnt.bofrpot.com సైట్‌లో ఉంచినట్లు డీఈవో పి.శైలజ పేర్కొన్నారు. పేర్లు ఉన్న అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఐదు పాస్‌పోర్ట్ ఫోటోలు, డీఎస్సీ–1998 హాల్ టిక్కెట్‌ను తీసుకుని గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ఉన్న డీఈవో కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

జై జై చెన్నకేశవా!

- మాచర్లలో అంగరంగ వైభవంగా శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం
- వేల సంఖ్యలో హాజరైన భక్తులు
- పాల్గొన్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

మాచర్ల: పట్టణంలో శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా వేలాది మంది భక్తులు చెన్నకేశవునికి జేజేలు పలుకుతూ నిర్వహించారు. శ్రీ, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను అర్చకులు స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపి సాయంత్రం 5 గంటలకు రథంపైకి తీసుకొచ్చారు. మండు టెండలో సైతం మధ్యాహ్నం నుంచే రథోత్సవం కోసం వేలాది మంది భక్తులు తరలి రావడం విశేషం. చెన్నకేశవ స్వామి రథోత్సవానికి ముందుగా ఆలయ అర్చకులు శేషాచార్యులు, శ్రవణాచార్యులు, అడిగొప్పల చెన్నకేశవాచార్యులు ఆలయ ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు గోపవరపు నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వర రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్, పురపాలక సంఘ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, శ్రీనివాసశర్మ, మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీను, ఇవో ఐ.సాంబయ్యల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవం స్వామివారి దేవాలయం నుంచి బురుజు సెంటర్ వరకు రథోత్సవం రాత్రి 6.30 గంటల వరకు కొనసాగింది. రెండు రాష్ట్రాల నుంచి భక్తులు చెన్నకేశవ స్వామి రథోత్సవాన్ని తిలకించేందుకు ఆయా ప్రాంతాల నుంచి వేలాది మంది తరలి రావడంతో చెన్నకేశవస్వామి దేవాలయం నుంచి రథోత్సవం జరిగిన వివిధ ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. గురజాల డీఎస్పీ మెహర్ జయరాం ప్రసాద్, అర్బన్ సీఐ టి.బాలకృష్ణ, కారంపూడి సీఐ జయకుమార్ పలువురు ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవానికి రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, మూడు జిల్లాల రీజనల్ ఆర్గనైజింగ్ కన్వీనర్ పిన్నెల్లి వెంకటరామి రెడ్డిల ఆధ్వర్యంలో ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు.



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, పీఆర్కే, పీవీఆర్‌లు

సామాజిక విప్లవ ప్రదాత జ్యోతిరావ్ పూలే

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



జెడ్పీలో జ్యోతిరావ్ పూలే చిత్రపటం వద్ద హెనీ క్రిస్టినా, మోహన్‌రావు

గుంటూరు ఎడ్యుకేషన్: అణగారిన వర్గాల అభ్యున్నతి కాంక్షించిన జ్యోతిరావ్ పూలే సామాజిక విప్లవ ప్రదాతగా నిలిచారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే 197వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారం కల్పించాలని మొట్ట మొదటిసారిగా సామాజిక న్యాయ నినాదాన్ని ఎలుగెత్తి చాటిన జ్యోతిరావ్ పూలే ఆశయాలు బాటలో ప్రతి ఒక్కరం ముందుకు వెళదామని పిలుపునిచ్చారు. సీఈవో జె. మోహన్‌రావు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు విద్యను అందించేందుకు జ్యోతిరావ్ పూలే తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి పాఠశాలలను స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, జెడ్పీటీసీలు కృష్ణారెడ్డి, గుల్జార్ బేగం, ఏవో శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సైన్స్ పరీక్ష ఇలా రాయండి!

- ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌కు కలిపి ఒకే ప్రశ్నపత్రం
- ఒకే ప్రశ్నపత్రంలో రెండు సబ్జెక్టులకు వేర్వేరుగా ప్రశ్నలు
- టెన్త్ విద్యార్థులకు డీఈవో సూచనలు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం జరగనున్న సైన్స్ పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులు పరీక్ష రాసే విషయంలో పలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం తెలిపారు. ఈ మేరకు టెన్త్ సైన్స్ పరీక్ష రాయనున్న విద్యార్థులకు ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ డి. దేవానందరెడ్డి పలు సూచనలు చేశారని చెప్పారు. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ ప్రశ్నలు ఒకే ప్రశ్నాపత్రంలో ఉంటాయని తెలిపారు. ప్రశ్నాపత్రం పార్ట్–ఏలో ఒకటి నుంచి 16 వరకు ఫిజికల్ సైన్స్ నుంచి, పార్ట్–బీలో 17 నుంచి 33 వరకు బయలాజికల్ సైన్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయని వివరించారు. జవాబులు రాసేందుకు వేర్వేరుగా ఓఎంఆర్‌లు కలిగిన రెండు 12 పేజీల బుక్‌లెట్లు ఒకేసారి అందిస్తామని, సంబంధిత ఓఎంఆర్‌లపై ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ అని ముద్రితమై ఉంటాయని వివరించారు. ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్‌కు సంబంధించిన సమాధానాలను ఆయా జవాబుపత్రాల బుక్‌లెట్లలోనే రాయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు పరీక్షా ప్రారంభానికి ముందుగానే పరీక్షా గదిలోని విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించి, కేటాయించిన జవాబు పత్రంలోనే సమాధానాలు రాసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ట్యాబ్‌పై బోధనకు శిక్షణ

- జిల్లా విద్యాశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ
- 75 శాతం ఉపాధ్యాయులు హాజరు
- ఆన్‌లైన్ శిక్షణకు హాజరుకాని వారికి మరో అవకాశం



ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్న దృశ్యం

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి అభ్యసించే విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల ద్వారా సమగ్ర బోధన చేయాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని తెలిపారు. మంగళవారం బైజూస్ ట్యాబ్‌ల వినియోగం, బోధన ప్రక్రియ, నిర్వహణ అంశాలపై ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. బోయపాలెం జిల్లా విద్యాశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 5 వేల మంది ఉపాధ్యాయులకు ఐదు విభాగాలుగా ఈ శిక్షణ అందించారు. శిక్షణలో ట్యాబ్ ఆవశ్యకత, వాటి నిర్వహణను డైట్ కళాశాల అధ్యాపకులు సౌజన్య, డాక్టర్ ప్రసాద్‌లు అవగాహన కల్పించారు. ప్రొగ్రాం స్టేట్‌నోడల్ ఆఫీసర్ హెచ్.పి.ఎస్. రమేష్ కుమార్ లాంగ్వేజెస్‌కు సంబంధించిన కంటెంట్‌పై త్వరలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. టెక్నో కంపెనీ ప్రతినిధులు సుమన్, సాయికృష్ణ ట్యాబ్ పాలసీ, కొత్తప్యాచ్ ఇన్‌స్టాల్ చేయడం, వాటి సెక్యూరిటీ గురించి వివరించారు. ట్యాబ్‌లు రిపేర్లు వచ్చినట్లయితే గ్రామ/వార్డు సచివాలయ ఎడ్యుకేషనల్, డిజిటల్ అసిస్టెంట్ సహాయంతో సరిచేసి విద్యార్థులకు ఇవ్వాలని తెలిపారు. అనివార్య కారణాలతో ఆన్‌లైన్ శిక్షణకు హాజరు కాని ఉపాధ్యాయులకు త్వరలో డైట్ కళాశాల ప్రాంగణంలో శిక్షణ ఇవ్వనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నోడల్‌పర్సన్ ఎం.పూర్ణచందరరావు, జి. ప్రకాష్, ఎం.రాము పాల్గొన్నారు.

రెంటచింతల @ 44.2

- భగ్గుమంటున్న సూరీడు
- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



రెంటచింతలలో నిర్మానుష్యంగా మారిన మాచర్ల-గుంటూరు రహదారి

రెంటచింతల: వేసవిలో మంటచింతలగా ప్రసిద్ధి చెందిన రెంటచింతల ఎండాకాలం ఆరంభంలోనే భగభగమండుతోంది. ఏరోజు ఎండ ఎక్కువకాసిన రెంటచింతల ఉష్ణోగ్రత ఎంత అని అడగడం సహజం. మంగళవారం గ్రామంలో గరిష్ట ఉష్ణోగ్రత 44.2 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 25.6 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ అధికారులు తెలిపారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ రెండవ వారంలోనే ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు కావడంతో గ్రామస్తులలో ఆందోళన నెలకొంది. ఈ ప్రాంతాలలో నాపరాయి నిక్షేపాలు ఎక్కువగా ఉండటం కారణంగానే ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతుందని వాతావరణ శాఖాధికారుల అభిప్రాయం. ఏప్రిల్, మే నేలలో ఎండతీవ్రతతోపాటు భూమి నుంచి వేడి సెగలు వస్తుంటాయి. దీనికితోడు వడగాలుల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురౌతుంటారు. ప్రస్తుతం ఇక్కడ సుమారు 41 నుంచి 44 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రత నమోదు అవుతుండటంతో గ్రామస్తులు ఉదయం 10 గంటలు దాటితేనే ఆరుబయటకు రావడానికి జంకుతున్నారు. వ్యవసాయ, వివిధ పనులకు వెళ్లే కూలీలు సైతం 12 గంటలకల్లా ఎండతీవ్రత తట్టుకోలేక ఇంటిముఖం పడుతున్నారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 108 అంబులెన్సుల్లో ఎమర్జెన్సీ టెక్నీషియన్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ నాగదీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం మేల్ అభ్యర్థులు ఉద్యోగానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం పై అంతస్తులోని 108 కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఏపీ గురుకుల ఉర్దూ బాలుర పాఠశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగురోడ్డులోని ఆంధ్రప్రదేశ్ గురుకుల ఉర్దూ బాలుర పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డీపీవీఎస్సార్ లక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశంతో పాటు 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ముస్లిం మైనార్టీ విద్యార్థులు https:aprs.apcfss.inవెబ్‌సైట్‌లో దరఖాస్తు, ప్రాస్పెక్టస్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తిరిగి అదేసైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. అదేవిధంగా మైనార్టీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష లేకుండా మే 15 నుంచి జూన్ 30వ తేదీ వరకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 99494 35594, 89852 97854 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డీఎల్‌ఎస్‌ఏలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు లీగల్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ(డీఎల్‌ఎస్‌ఏ)లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేసేందుకు పలు ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైపిస్ట్ కమ్ అసిస్టెంట్, ఖాళీలు–1, జీతం రూ.18,500, కార్యాలయ సబార్డినేట్లు, ఖాళీలు –2, జీతం రూ. 15,000. ఆసక్తిగలవారు తమ దరఖాస్తులను చైర్మన్, జిల్లా న్యాయ సేవల అథారిటీ, గుంటూరు చిరునామాకు పంపాలని సూచించారు. ఏప్రిల్ 21 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని పేర్కొన్నారు. మిగిలిన వివరాలను జిల్లా కోర్టు వెబ్‌సైట్‌లో చూడాలని తెలియజేశారు.

శతాధిక వృద్ధురాలు మృతి

కాకుమాను: మండల కేంద్రం కాకుమానుకు చెందిన శతాధిక వృద్ధురాలు లింగిశెట్టి వనజాక్షమ్మ(107) సోమవారం రాత్రి అనారోగ్య కారణంతో మృతి చెందారు. 105 సంవత్సరాల వయసు వరకు కూడా తన పనులు తానే చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు. వనజాక్షమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, ఆరుగురు మనుమళ్లు, మనుమరాండ్లు, పదిమంది ముదిమనమళ్లు ఉన్నారు.

ఆర్పీల అపహా'రుణం'

- మెప్మాలో మాయాజాలం
- డ్వాక్రా సంఘాల పేరుతో రుణాల కాజేత
- సుమారు రూ.కోటిన్నర మేర టోకరా
- మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే చాన్స్



రేపల్లె: మహిళలకు ఆర్థిక సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) అక్రమాలకు అడ్డాగా మారింది. బాపట్ల జిల్లా, రేపల్లె పురపాలక సంఘం మెప్మా విభాగంలో పనిచేస్తున్న యానిమేటర్లు స్వయం సహాయక సంఘాలను అడ్డుపెట్టుకుని కొందరు బ్యాంకులను లూటీ చేశారు. సేకరించిన వివరాల ప్రకారం మెప్మాలో ఆర్పీ(రిసోర్స్ పర్సన్లు)లుగా పనిచేస్తున్న పట్టణంలోని 21వ వార్డుకు చెందిన ఇద్దరు మహిళలు, మరో మహిళ కలిసి 2019 ఏప్రిల్ 11కు ముందు ఉన్న గ్రూపులను లక్ష్యంగా చేసుకుని మోసానికి తెగబడ్డారు. కొందరు నిరక్షరాస్యులతో మాట్లాడి వారికి ప్రత్యేక పొదుపు సంఘాలు ఉన్నా, మీకు ఒక్కొక్కరికి రూ.5,000 అప్పు ఇప్పిస్తామని, రుణమాఫీ వస్తుందని, తిరిగి కట్టవలసిన అవసరం లేదని చెప్పి వారిగ్రూప్ పేరుతో రూ.10 లక్షలు రుణాలు పొందారు. ముందు అనుకున్న ప్రకారం సంఘ సభ్యుల చేతుల్లో రూ.5 వేలు పెట్టారు. ఈ తతంగం మెప్మాలో పనిచేస్తున్న సిబ్బందితోపాటు బ్యాంక్ అధికారుల సహకారంతోనే జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో 11 గ్రూప్‌లకు కలిపి సుమారు కోటి 15 లక్షల రూపాయలు లింకేజీ రుణాలు తీసుకున్నట్టు సమాచారం. ఇలాగే మరికొన్ని బ్యాంకుల్లోనూ అప్పులు తీసుకున్నట్టు తెలుస్తోంది. కెనరా బ్యాంకులో రూ.35లక్షల మేర రుణాలు తీసుకున్నట్టు సమాచారం. తిలాపాపం తలా పిడికెడు అన్న రీతిగా నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలను ఏమార్చి ఒక్కొక్క గ్రూపునకు రూ.10 లక్షలు, కొన్ని గ్రూప్‌లకు రూ.20 లక్షలు, మరికొన్ని గ్రూపులకు రూ.6లక్షల మేర రుణాలు మంజూరు చేయించి కాజేశారు. తీసుకున్న రుణాలు ఎంతకీ చెల్లించక పోవటం, ఎన్నిసార్లు ఆర్పీలకు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో బ్యాంకు అధికారులు డ్వాక్రా మహిళలకు నోటీసులు పంపటంతో అక్రమాలు వెలుగు చూశాయి. ఒకే మహిళా సంఘం పేరున జీడీసీసీ బ్యాంకు లోనూ, కెనరా బ్యాంకులోనూ రుణం ఉండడం గమనార్హం. ఈ రెండు బ్యాంకుల్లోనూ మహిళల ఫోటోలు, పేర్లు, చిరునామాలకు పొంతన లేకుండా ఉంది. నిజాంపట్నం, తాడేపల్లి, భీమవరం, అనకాపల్లి మరికొన్ని రూరల్ ప్రాంతాల చిరునామాలు, రేపల్లె పురపాలక సంఘంలో ఉన్న స్వయం సహాయక గ్రూపుల్లో ఉండటం విస్తుగొలుపుతోంది.

ఇవిగో నిదర్శనాలు

జీడీసీసీ బ్యాంకు రేపల్లె శాఖలో రోషిణి, అప్సరా, అప్సని, షాహీనా, బిస్మిల్లా, రామకృష్ణ, శ్రీ నాగేశ్వరి, తేజ, జరీనా, ఫైజుల్లా, మహిళ పొదుపు సంఘాల పేర్లతో రుణాలు ఉన్నాయి. కెనరా బ్యాంకులో తేజ స్వయం సహాయక సంఘానికి మూడు విడతల్లో ఆసరా పథకం ద్వారా రూ.39,766 రుణమాఫీ డబ్బులు పడ్డాయి. అప్సరా గ్రూప్‌నకు రూ.1,12,191, బిస్మిల్లా గ్రూపునకు రూ.1,20,500, రామకృష్ణ గ్రూపుకు రూ.1,67,943 రోషిణి గ్రూపునకు రూ.1,48,756 ఆసరా పథకం ద్వారా జమయ్యాయి. వాస్తవానికి ఒక బ్యాంకులో రుణం ఉంటే రెండో బ్యాంకులో మంజూరు కాదు. కానీ ఇక్కడ ఇది ఎలా సాధ్యమైంది అన్నది అర్థం కావట్లేదు. దీనిపై తమకు ఏమి తెలియదని జీడీసీసీ బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. మెప్మా సిబ్బంది అంగీకారం తెలిపారు కాబట్టి రుణాలు మంజూరు చేశామని చెబుతున్నారు. పూర్తిస్థాయి విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు బయటపడే ఆస్కారం ఉంది.

అక్రమాలు జరిగిన మాట వాస్తవమే

ఆర్పీలు అక్రమాలకు పాల్పడిన మాట వాస్తవమే. ఇప్పటికే ఇద్దరు అర్పీలను విధులకు దూరంగా ఉంచాం.

– సుగుణ, మెప్మా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్)

తప్పుడు పత్రాలతో రుణాలు పొందారు

తప్పుడు పత్రాలతో ఆర్పీలు రుణాలు పొందిన మాట వాస్తవమే. రికవరీ చేయకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మెప్మా సిబ్బంది రుణాలు పొందే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ చేయక పోవటం వల్ల తప్పు జరిగింది.

– వెంకటరమణ, జీడీసీసీ బ్యాంకు మేనేజర్, రేపల్లె

బొబ్బేపల్లిలో మైనింగ్ అధికారుల తనిఖీ



గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం

మార్టూరు: బొబ్బేపల్లి గ్రామంలో మైనింగ్ విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారి జగన్నాథరావు, అసిస్టెంట్ జియాలజిస్ట్ రమేష్ కుమార్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. బొబ్బేపల్లి కొండ సమీపంలో సర్వే నంబర్ 387లో గ్రావెల్ తవ్వకాల కోసం అదే గ్రామానికి చెందిన కుంచపు వీరాంజనేయులు గతంలో అనుమతులు తీసుకుని ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన కొందరు అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతున్నారంటూ వీరాంజనేయులు గత సోమవారం బాపట్ల గ్రీవెన్స్‌సెల్‌లో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో అధికారులు మంగళవారం సాయంత్రం గ్రామంలో మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అసిస్టెంట్ జియాలజిస్ట్ రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రావెల్ తవ్వకాలు ఇతరులు జరుపుతున్న మాట వాస్తవమేనని, కాని కుంచపు వీరాంజనేయులుకు అనుమతులిచ్చిన ప్రాంతంలో తవ్వకాలు జరగడం లేదని పేర్కొన్నారు. సర్వే నంబర్ 387లో వెలుపల వైపు గ్రామస్తులు తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో రోడ్లు తదితర అవసరాల కోసం 1,100 ట్రక్కుల గ్రావెల్ అవసరమైనందున అందుకోసమై పంచాయతీ తీర్మానం చేసుకొని తవ్వకాలు జరిపినట్టు పంచాయతీ సర్పంచ్ వర్గం చెబుతోందని వివరించారు. రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారి జగన్నాథరావు మాట్లాడుతూ కేవలం పంచాయతీ తీర్మానం చేసుకొని గ్రావెల్ తవ్వకాలు జరుపుకుంటామంటే కుదరదని, మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులు తీసుకుంటేనే తవ్వకాలు జరుపుకోవాలని చెప్పారు. గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాన్ని పూర్తిగా సర్వే చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు భాస్కర్‌రెడ్డి, రాజీనాయుడు, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావుపూలే

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: దేశాన్ని పట్టిపీడిస్తున్న సామాజిక రుగ్మతలపై పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతీరావుపూలే అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి రజిని మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన కోసం పూలే ఎంతగానో కృషి చేశారని వివరించారు. మహిళాభ్యున్నతికి, బాలికా విద్య కోసం ఎంతో పాటుపడ్డారని కొనియాడారు. బాలికల కోసం 1848లోనే దేశంలోనే మొదటి బాలికా పాఠశాల ప్రారంభించి మహిళల విద్యాభ్యున్నతికి అంకుర్పారణ చేశారని చెప్పారు. పూలే ఆశయ సాధన కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని వెల్లడించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లో ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నాయకులు గుంజి వీరాంజనేయులు, రాచమంటి చింతారావు, కందుల శ్రీకాంత్, పార్టీ వివిధ విభాగాల నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భారతీయ తొలి సామాజిక సంస్కర్త పూలే

మంత్రి అంబటి రాంబాబు



పట్టణంలోని వైఎస్‌ఆర్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: తొలి మహాత్మా బిరుదాంకితుడు, పీడిత వర్గాల దార్శనికుడు, ప్రథమ మహిళా విద్యా ప్రబోధకుడు, భారతీయ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతీబాపూలే అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే 196వ జయంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ మన సమాజంలో ఉన్న దురాచారాలకు, కుల వివక్షకు వ్యతిరేకంగా 150 సంవత్సరాలకు పూర్వమే ప్రజలను కూడ గట్టి పోరాడి, అనేక విజయాలు సాధించిన జ్యోతిబాపూలే దేశంలోని పీడిత వర్గాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. పూలే స్ఫూర్తితోనే నేడు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. సామాజిక న్యాయాన్ని అమలుచేస్తూ మంత్రివర్గ, నియామక పదవుల్లో కూడా బీసీలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని వివరించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సదరం క్యాంపులు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని సదరం క్యాంపులు ఏపీ వైద్యవిధాన పరిషత్‌కు చెందిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వారాల వారీగా నిర్వహిస్తారని జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నరసరావుపేటలో మంగళ, శుక్రవారాల్లోను, సత్తెనపల్లిలో శుక్రవారం, చిలకలూరిపేటలో బుధవారం, పెదకూరపాడులో మంగళవారం, వినుకొండలో మంగళవారం, గురజాల, మాచర్లలో శుక్రవారాల్లో నిర్వహిస్తారన్నారు. పై తెలిపిన వారాల్లో సదరం స్లాట్స్ బుకింగ్ చేసుకొన్న వారికి చూస్తారని తెలిపారు. గతంలో వెయిటింగ్ లిస్టు వచ్చిన వారికీ వారి రిజిస్టర్డ్ మొబైల్ ఫోన్‌కి మెసేజ్ వస్తుందన్నారు. వారికి ఏ తేదీన వస్తే ఆ రోజు ఆ హాస్పిటల్ వెళ్లి సంప్రదించాలని కోరారు. పబ్లిక్ సెలవులు రోజు సదరం క్యాంపు ఉండదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు.

ఒక్కరోజే 600 హద్దురాళ్లు ఏర్పాటు



పరిశీలిస్తున్న ఆర్డీఓ శేషిరెడ్డి

ఈపూరు: నరసరావుపేట డివిజన్‌లో రీ సర్వే వేగవంతంగా జరుగుతుందని ఆర్డీఓ శేషిరెడ్డి అన్నారు. స్టోన్స్ డే (సర్వేరాళ్ల ఏర్పాటు దినోత్సవం) సందర్భంగా మండలంలోని వనికుంట గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. హద్దురాళ్లను ఏర్పాటును ఆయన పర్యవేక్షించారు. వనికుంట గ్రామంలో మొత్తం 3463 హద్దు రాళ్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 1900 రాళ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్టోన్స్ డే సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 600 రాళ్లను హద్దులలో బిగిస్తున్నట్లు తెలిపారు. మండలం మొత్తం త్వరలో రీసర్వే పూర్తి చేసి సర్వే ప్రకారం మ్యాప్‌ల ఆధారంగా రాళ్లను ఏర్పాటు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, సర్వేయర్ చండీరాణి తదితరులు పాల్గొన్నారు.

భూసర్వే స్టోన్‌ప్లాంటేషన్ పరిశీలించిన జేసీ



స్టోన్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న జేసీ శ్యామ్‌ప్రసాదు, ఉద్యోగులు

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు, అలవాల, ముత్తనపల్లి, ఆరేపల్లి గ్రామాల్లో భూసర్వే పూర్తయిన భూముల్లో స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. జగనన్న భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా సర్వే పూర్తయిన భూములకు హద్దు రాళ్లు ఏర్పాటుచేయటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంకారావు, మండల సర్వేయరు భాగ్యలక్ష్మి, ఆయా గ్రామాల వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

పరీక్ష ఫెయిల్ అవుతానన్న భయంతో బాలిక బలవన్మరణం

మార్టూరు: పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని తాను ముందురోజు రాసిన పరీక్ష ఫెయిల్ అవుతానన్న భయంతో బలవన్మరణానికి పాల్పడింది. ఈ దుర్ఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని డేగరమూడి గ్రామంలో మంగళవారం జరిగింది. సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్, ఉపాధ్యాయులు, స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక ఆదర్శ నగర్ కాలనీకి చెందిన ముక్తిపాటి అంకమ్మరావు, పుణ్యవతి దంపతులు కుమార్తె నాగపూజిత (15) ప్రస్తుతం మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తోంది. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పనుల మీద బయటకు వెళ్లగా నాగపూజిత ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. సుమారు 11 గంటల సమయంలో నాగపూజిత అమ్మమ్మ, తాతయ్యలు ఇంటిలో ఫ్యాన్‌కు వేలాడుతున్న మనుమరాలిని గమనించి, స్థానికులు సహాయంతో కిందకు దించి 108 ద్వారా మార్టూరు ప్రభుత్వాస్పత్రి కి తరలించారు. బాలికను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సీఐ ఫిరోజ్ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికి నాలుగు పరీక్షలు రాసి మరో రెండు పరీక్షలకు సిద్ధమవుతున్న నాగపూజిత తెలివైన, చురుకైన విద్యార్థిని అని, అయితే ముందు రోజు రాసిన లెక్కల పరీక్షలో మార్కులు తగ్గుతాయనే అనుమానంతో ఆందోళనకు గురై ఈ దారుణానికి ఒడిగట్టినట్టు తండ్రి అంకమ్మరావు పోలీసుల వద్ద కన్నీరుమున్నీరయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు



మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

బల్లికురవ: ప్రభుత్వం పొదుపు గ్రూపుల బలోపేతానికి మహిళల జీవనోపాధుల పెంపుదలకు అందిస్తున్న స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజి రుణాలు సకాలంలో చెల్లించాలని డీఆర్ డీఏ పీడీ డాక్టర్ బి.అర్జున్‌రావు కోరారు. మంగళవారం బల్లికురవలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండలంలోని 42 గ్రామైక్య సంఘాలతో సమీక్ష నిర్వహించారు. 2022–23 సవత్సరానికి స్త్రీనిధి, సీఏఎఫ్ ఉన్నతి, బ్యాంక్ లింకేజ్ రుణాలు రూ.52 కోట్లు వరకు అందజేసినట్లు చెప్పారు. సూరేపల్లి, పెద అంబడిపూడి, కొప్పరపాడు, గ్రామైక్య సంఘాల దాదాపు రూ.22 లక్షలు రుణాలు చెల్లించకపోవటంపై పీడీ అసహనం వ్యక్తం చేశారు. 2023–24 సంవత్సరానికి రుణ లక్ష్యాలను పెంచనున్నట్లు పీడీ ప్రకటించారు. సమీక్షలో ఏపీఎం బీ. సురేంద్రబాబు, స్త్రీనిధి మేనేజర్ శంకర్, సీసీలు పాల్గొన్నారు.

మోహన్‌బాబు కుటుంబ సభ్యులకు హైకోర్టు జడ్జి పరామర్శ

కారంచేడు: సినీ నిర్మాత, మాజీ ఎంపీ డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు తమ్ముడు, సినీ నిర్మాత దగ్గుబాటి రామ్మోహనరావు (మోహన్‌బాబు) ఈనెల 4న మృతి చెందిన విషయం తెలిసిందే. మోహన్‌బాబు కుటుంబానికి సన్నిహితులు, బంధువు అయిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం సాయంత్రం కారంచేడు వచ్చారు. మోహన్‌బాబు సతీమణి శారదాదేవిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

పూజారికి ఐదేళ్లు జైలు

గుంటూరులీగల్: పూజ చేయించుకునేందుకు గుడికి వచ్చిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన పూజారికి ఐదేళ్లు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి రూరల్ పీస్ పరిధిలోని ఓ గుడిలో కృష్ణమూర్తి అనే వ్యక్తి పూజారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. 2019లో పూజ చేయించుకునేందుకు బాలిక గుడికి రాగా హారతి ఇచ్చే సమయంలో ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పింది. తల్లి స్థానిక పెద్దలను తీసుకెళ్లి పూజారిని నిలదీసింది. అనంతరం మంగళగిరి రూరల్ పోలీ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడు కృష్ణమూర్తిపై నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ శ్యామల కేసు వాదించారు.

దాడి ఘటనలో టీడీపీ కార్యకర్తలపై కేసు

అమరావతి: అమరావతిలో ఈ నెల 9వ తేదీన బస్సుపై దాడి చేసిన టీడీపీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కోటేశ్వరరావు మంగళవారం పేర్కొన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధిపై చర్చకు సవాళ్లు విసురుకున్న నేపథ్యంలో ఈనెల 9వ తేదీన అమరావతిలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. శ్రీధర్‌ను అమరావతి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న బస్సుపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఈ సంఘటనలో బస్సు అద్దం పగిలిపోవటంతో 17మంది టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 9వ తేదీ ఉదయం 144వ సెక్షన్ అమలులో ఉండగా నిబంధనలు అతిక్రమించిన కొంతమందిని ముందస్తు జాగ్రతగా అరెస్టు చేసిన కేసు నమోదు చేసినట్లు తెలిపారు.